క్లుప్తంగా

పోగొట్టుకున్న ఫోన్‌ల అందజేత

బోధన్ టౌన్ : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న ఫోన్లను బాధితులకు సోమవారం పట్టణ సీఐ వెంకటనారాయణ అందజేశారు. ఈసీఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందించామని సీఐ పేర్కొన్నారు.

పట్టణంలో సబ్‌కలెక్టర్ పర్యటన



కెనాల్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వికాస్ మహతో

బోధన్‌టౌన్ : పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం సబ్ కలెక్టర్ వికాస్ మహతో పర్యటించారు. పట్టణంలోని 5,9,35 వార్డులో కాలువపై గల కల్వర్టులు అధ్వానంగా మారడంతో వాటిని సబ్ కలెక్టర్ పరిశీలించారు. కల్వర్టుల నిర్మాణం, మరమ్మతుల కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అనంతరం బెల్లాల్ చెరువును పరిశీలించారు. తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ వెంకట నారాయణకు సూచించారు.డీఈ యోగేష్, ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

పన్ను కట్టని దుకాణాలు సీజ్

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో ఆస్తి పన్ను చెల్లించని నాలుగు దుకాణాలను సోమవారం బల్దియా అధికారులు తాళం వేసి సీజ్ చేశారు. బకాయి ఉన్న దుకాణాల్లో బల్దియా అధికారులు పన్ను వసూలు చేస్తున్నారు. అనిల్ టాకీస్ రోడ్డులో రెండు దుకాణాలతో పాటు మరో రెండు దుకాణాలను అధికారులు సీజ్ చేశారు. సకాలంలో ఆస్తి పన్ను చెల్లించాలని లేనిచో దుకాణాలను సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు.

ట్రాన్స్‌జెండర్ల ఆగడాలు అరికట్టాలి



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న వీడీసీ సభ్యులు

కమ్మర్‌పల్లి: ట్రాన్స్‌జెండర్ల ఆగడాలను అరికట్టాలని కమ్మర్‌పల్లి గ్రామాభివృద్ధి కమిటీ స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. ఇటీవల వివాహాది శుభకార్యాలు, నూతన గృహ ప్రవేశం, నూతన వ్యాపారం ప్రారంభం తదితర శుభకార్యాల్లో ట్రాన్స్‌జెండర్ల ఆగడాలను శృతి మించిపోతున్నాయి. ఈనేపథ్యంలో బాధితులు, గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు గ్రామాభివృద్ధి కమిటీ చొరవ తీసుకొని పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎస్సై అనిల్‌రెడ్డి ట్రాన్స్‌జెండర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ట్రాన్స్‌జెండర్లు శుభకార్యాలకు వచ్చి ఇబ్బంది పెడితే 8712659770, 8712659868 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం

రుద్రూర్ : మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. సోమవారం ఇళ్ల నిర్మాణానికి ముగ్గు వేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి భీమ్‌రావ్, మండల పంచాయతీ అధికారి గంగాధర్, రాణంపల్లి, అంబం (ఆర్) జీపీ కార్యదర్శులు శ్రావణ్, మోహన్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ముల్లంగి గ్రామంలో..

మాక్లూర్ : మండలంలోని ముల్లంగి గ్రామంలో సోమవారం గృహనిర్మాణాధికారి ప్రభు, ఏఈ సత్యనారాయణ లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు రామా గౌడ్, రాజేష్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎడపల్లి(బోధన్): వేసవిలో డిమాండ్ దృష్ట్యా వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని బోధన్ డీఈ ముక్తార్ కోరారు. మండలంలోని ఠాణాకలాన్ గ్రామంలో సోమవారం విద్యుత్ వినియోగదారులకు, రైతులకు విద్యుత్ ఆదాపై పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన, విద్యుత్ శాఖ ఏడీఈ ప్రభాకర్, సిబ్బందితో కలిసి గ్రామంలో అవగాహన కల్పించారు. ఏఈ కిశోర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

బోధన్: రంజాన్‌ను పురస్కరించుకొని జాడిజమాల్‌పూర్ గ్రామానికి చెందిన వ్యాపారవేత్త షేక్ హైమద్ హుస్సేన్ (బాబు) 50 ముస్లిం కుటుంబాలకు నిత్యావసర వంట సరుకులు వితరణ చేశారు. సోమవారం గ్రామంలోని ముస్లిం పెద్దలు జానుబేగం చేతుల మీదుగా వారికి అందజేశారు.

గుంతలమయంగా రోడ్డు

- నరకప్రాయంగా మారిన తల్వేద – నాళేశ్వర్ దారి
- వర్షాలకు కొట్టుకుపోయినా పట్టించుకోని అధికారులు



గుంతలతో ఉన్న తల్వేద-నాళేశ్వర్ గ్రామాల మధ్య గల రోడ్డు

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలం తల్వేద నవీపేట మండలం నాళేశ్వర గ్రామాల మధ్య గల రోడ్డు గుంతలమయంగా మారింది. భారీ వర్షాల కారణంగా మూడేళ్ల క్రితం రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ప్రయాణికులకు ఈరహదారి నరకప్రాయంగా మారింది. ఈరోడ్డు గుండా నందిపేట మండలంలోని పలు గ్రామాల నుంచే కాకుండా ఇతర మండలాలకు చెందిన ప్రజలు ప్రయాణం చేస్తారు. దూరం తగ్గుతుందని నందిపేట మండల ప్రజలు భైంసా, బాసర, ముధోల్, మహారాష్ట్రలోని పలు గ్రామాలకు వెళ్లేందుకు ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తారు. రోడ్డు కోతకు గురైనా ప్రాంతంలో మట్టి పోసి వదిలేశారు. గతంలో ప్రమాదాలు జరిగిన అధికారులు స్పందించడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఈవిషయం మా పరిధిలో లేదని చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు.

రోడ్డుకు మర్మమతులు చేపట్టాలి

గ్రామ శివారులోని నాళేశ్వర్‌కు వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదు. నాయకులు రోడ్డును పరిశీలించిన మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం లేదు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

–సాయరెడ్డి, తల్వేద గ్రామస్తుడు

అధికారులు స్పందించాలి

వర్షకాలంలో భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డు గుండా వాహనాల రాకపోకలు జోరుగా ఉంటాయి.అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి.

–తొంటి సాయన్న, తల్వేద గ్రామస్తుడు

త్వరలో పనులు చేపడుతాం

నాళేశ్వర్ తల్వేద గ్రామాల మధ్య రోడ్డు పనులను త్వరలో చేపడుతాం. నాళేశ్వర్ నుంచి నందిపేట మండల గ్రామాల మీదుగా డొంకేశ్వర్ వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

–కిషన్, పంచాయతీరాజ్ డీఈ, ఆర్మూర్ డివిజన్

పారిశుధ్య కార్మికులతోనే శుభ్రత



ఆర్మూర్‌టౌన్ : పారిశుధ్య కార్మికులతోనే పట్టణం పరిశుభ్రంగా ఉంటుందని కమిషనర్ రాజు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కార్మికులు, మెప్మా సిబ్బందిని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సన్మానించారు. టౌన్‌ప్లానింగ్ అధికారి ఆంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, సిబ్బంది ఉన్నారు.

డీఎల్‌పీవోగా నాగరాజు బాధ్యతల స్వీకరణ



బోధన్: బోధన్ డివిజనల్ పంచాయతీ అధికారిగా ఎస్.నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాన్సువాడలో పనిచేసిన నాగరాజును బోధన్‌కు బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. కాగా, ఇన్నాళ్లు బోధన్ ఇన్‌చార్జి డీఎల్‌పీవోగా ఎంపీవో మధుకర్ విధులు నిర్వర్తించారు.

రోబోటిక్స్‌పై శిక్షణలో విద్యార్థుల ప్రతిభ



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న హెచ్‌ఎం కిషోర్

బోధన్ : పట్టణకేంద్రంలోని తట్టికోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోబోటిక్స్‌పై శిక్షణ, సాంకేతిక అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. ఈశిక్షణను బోధన్‌కు చెందిన అన్విసోల్ సాఫ్ట్‌వేర్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్‌ఆర్) కార్యక్రమంలో భాగంగా ఐదు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించింది. పాఠశాల ప్రాంగణంలో సోమవారం వినూత్న ప్రాజెక్టులు ప్రదర్శించి విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇందులో హ్యూమన్ ఫాలోయింగ్ రోబోట్, అంధుల కోసం స్మార్ట్‌స్టిక్, అడ్డంకులు ఉన్నప్పుడు అప్రమత్తం చేసే విధానం, విజిటర్ కౌంటింగ్ మెషిన్ (సందర్శకుల సంఖ్యను ఆటోమేటిక్‌గా లెక్కించి ట్రాక్ చేసే పరికరం) ఇలా వినూత్న ప్రాజెక్టులు రూపొందించారని నిర్వాహకులు తెలిపారు. ఈ శిక్షణను నిపుణులు భూమిరెడ్డి, అభినయ్‌రెడ్డి, ఎర్ర సాయి గణేష్, సాయికృష్ణ, రాజశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో కొనసాగింది. సంస్థ ఫౌండర్ శ్రీశైల్ దేశ్‌పాండే, సీఎస్‌ఆర్ హెడ్ సతీష్ ఇనానీ, పాఠశాల హెచ్‌ఎం కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

సిద్ధులగుట్టలో భక్తుల ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని సిద్దులగుట్టపై సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి శివాలయంలో పంచామృతాలతో స్వామి వారికి అభిషేకం చేశారు. అలాగే దత్తాత్రేయ, దుర్గామాత, రామాలయం, అయ్యప్ప ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం కొండవీటి శ్యామ్ ప్రసాద్ నిర్మించిన 'నిన్నే నమ్ముకున్న పరమశివుడా' వీడియో క్యాసెట్‌ను పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి. సుమన్, బీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, పూజారి సతీష్, చరణ్ రెడ్డి, బట్టు శంకర్, సందేశ్ శ్రీనివాస్, ప్రశాంత్ గౌడ్, కొంతం మంజుల, మురళి, అలిశెట్టి నరేష్, రామా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణముఖి ఆంజనేయస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠాపన



రుద్రూర్ : మండలంలోని అంబం (ఆర్) గ్రామంలో శ్రీ దక్షిణముఖి ఆంజనేయస్వామి ఆలయ విగ్రహ శిఖర ప్రతిష్ఠాపన, మహా కుంభాభిషేకం వేడుకలు కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామిజీ ప్రవచనం ఇచ్చారు.

నేడు రుద్రూర్‌కు అవధూత స్వామి రాక

రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బసవ కల్యాణ్ ఆశ్రమ పీఠాధిపతి డా. బసవలింగ అవధూత స్వామి రానున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కందకుర్తిని దర్శించుకున్న రాజేంద్రదాస్ మహరాజ్

రెంజల్(బోధన్): ఉత్తర ప్రదేశ్‌లోని ముణుక్ జిల్లా బృందావన్ ధాం ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ 1008 రాజేంద్రదాస్ మహరాజ్ సోమవారం కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రాన్ని దర్శించుకున్నారు.



ఇక్కడి సీతారాం ధాం త్యాగి మహరాజ్ ఆశ్రమంలో భక్తులను కలిశారు. అంతకు ముందు త్రివేణి సంగమ పుష్కరక్షేత్రం పురాతన శివాలయం వద్ద గోదావరి నదిలో స్నానమాచరించారు. ఆలయ ప్రాంగణంలో జపం చేసి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు మహారాష్ట్రలోని నాందేడ్ సమీపంగలో గల పిప్పళ్‌గావ్ ఆశ్రమం నుంచి విఠల్ మహరాజ్‌తో పాటు కాశీ, అయోధ్య, మధురల నుంచి మండలేశ్వర్‌లు, అర్ధ మండలేశ్వర్‌లు 20 మంది వరకు అమల ఏకదశి సందర్భంగా త్రివేణి సంగమానికి తరలివచ్చారు.

నూతన శివాలయం ప్రారంభం



బోధన్‌రూరల్ : మండలంలోని లంగ్డాపూర్ గ్రామ శివారులో సోమవారం నూతన శివాలయం ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ, మల్లారం గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహరాజ్ హాజరయ్యారు. వేద పండితుల మంత్రాల మధ్య దేవత యంత్ర, మూర్తి, శిఖర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం వీరు భక్తులకు ప్రవచనం ఇచ్చారు. అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పోచారం



రుద్రూర్: రంజాన్ మాస ఉపవాస దీక్షల సందర్భంగా కోటగిరిలో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు సిరాజుద్దీన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆబీద్, మండల, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



ఎడపల్లిలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్/ఎడపల్లి/వేల్పూర్ : సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతిని బీసీ సంఘాల, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. సావిత్రి బాయి పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో బీసీ గ్రాడ్యుయేట్స్ చైర్మన్ అబ్బగోని అశోక్ గౌడ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి డల్ల సురేష్ మాదిగ , బీసీ నేతలు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



రామన్నపేట్‌లో..

పాఠశాలలో కరాటే డ్రెస్‌ల పంపిణీ

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని మధుమలాంఛ పాఠశాల ఆవరణలో కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులకు కరాటే డ్రెస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ వెంకట నారాయణ మాట్లాడారు.శివాలయం చైర్మన్ హరికాంత్ చారి, హెచ్‌ఎం నరేందర్, అధ్యాపకులు ఉన్నారు.

పల్లె ప్రకృతి వనాలపై పట్టింపేది

- వనంలో ఎండుతున్న మొక్కలు
- పట్టించుకోని అధికారులు



బాల్కొండ ప్రకృతి వనంలో ఎండిన మొక్కలు

బాల్కొండ: బాల్కొండ ఉమ్మడి మండలంలో పల్లె ప్రకృతి వనాలను అధికారులు పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.7.10 లక్షల నిధులను ఒక్కో పల్లె ప్రకృతి వనం నిర్మాణానికి కేటాయించారు. వనంలో నీడనిచ్చె మొక్కలతో పాటు అలంకారప్రాయమైన మొక్కలను వనసేవకులు నాటారు. ప్రస్తుతం మొక్కలకు నీరు అందించక పోవడంతో ఎండిపోతున్నాయి. వనమంతా ఎండిన ఆకులతో నిండిపోయింది. పొరపాటున నిప్పు రాజుకుంటే వనం పూర్తిగా దగ్ధమయ్యే ప్రమాదముంది. వనంలో పిచ్చి మొక్కలు సైతం ఏపుగా పెరిగాయి. మొక్కలు ఎండిపోకుండా అధికారులు చొరవ తీసుకోవాలి ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

పల్లె ప్రకృతి వనంలో పేరుకు పోయిన చెత్తాను తొలగించుటకు చర్యలు తీసుకుంటాం. మొక్కలు ఎండిపోకుండా నీరు పట్టాలని సూచిస్తాం.

– విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో బాల్కొండ

ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు ప్రారంభం



రెంజల్‌లో రిలే దీక్షలు ప్రారంభించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

రెంజల్/రుద్రూర్/ఆర్మూర్‌టౌన్ : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ పలు చోట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం రిలే దీక్షలు చేపట్టారు. రెంజల్ ఎంపీడీవో కార్యాలయం ముందు రిలేదీక్షలో జిల్లా ప్రధాన కార్యదర్శి భూమయ్య మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యే వరకు దీక్షలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. పోతంగల్ తహసీల్ కార్యాలయం వద్ద రిలే దీక్షలో ఎమ్మార్పీస్ జిల్లా సహాయ కార్యదర్శి సోంపూర్ పోచిరాం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలు చేసే వరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలన్నారు. ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే దీక్షలో ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి మైలారం బాలు మాట్లాడుతూ గ్రూప్-1, 2, 3 పరీక్షల ఫలితాలను ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తర్వాత మాత్రమే విడుదల చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



పోతంగల్‌లో ..



ఆర్మూర్‌లో ..

రైతాంగ సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయండి



మాట్లాడుతున్న అఖిల భారత రైతు సంఘం ప్రతినిధులు

ఆర్మూర్: రైతాంగ సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని అఖిల భారత రైతు సంఘం (ఏఐయూకేఎస్) రాష్ట్ర కార్యదర్శి బీ.దేవరాం పిలుపునిచ్చారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక, కార్పొరేట్ సంస్థల అనుకూల వైఖరిని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఏఐయూకేఎస్ జిల్లా సహాయక కార్యదర్శి బాబన్న, రైతు నాయకులు ఉన్నారు.

పసుపు రైతుల ఉద్యమానికి మద్దతు

జిల్లాకేంద్రంలోని పసుపు మార్కెట్‌లో సిండికేట్‌గా మారి ధర తగ్గిస్తున్న వ్యాపారస్తులకు వ్యతిరేకంగా రైతులు చేస్తున్న ఉద్యమానికి అఖిల భారత రైతు సంఘం (ఏఐయూకేఎస్) మద్దతు తెలుపుతుందని నాయకులు సోమవారం ప్రకటించారు. ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ.ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి బీ.దేవరాం, జిల్లా నాయకుడు కిషన్ మాట్లాడుతూ వ్యాపారస్తులు ధరలు తగ్గిస్తూ రైతులను మోసం చేస్తున్న తీరుపై తాము రైతు జేఏసీ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో పర్యటించి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం పసుపు పంటకు క్వింటాల్‌కు రూ. వెయ్యి బోనస్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

- స్క్రీన్-1: రాక్షస(తెలుగు)-1.45; సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (తెలుగు)-4.20, 10.10; నారి(ది ఉమెన్)(తెలుగు)-7.35
- స్క్రీన్-2: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు(తెలుగు)-10.15, సివంగి(తెలుగు)-1.30, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్(తెలుగు)-4.10, 7.20, 10.30
- స్క్రీన్-3-: ఛావా(తెలుగు)-10.00, 4.20, కింగ్స్టన్(తెలుగు)-1.20,7.40, 10.40
- స్క్రీన్-4: ఛావా(తెలుగు)-12.20, 7.00, ఛావా(హిందీ)-3.40, 10.20

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1: ఛావా(తెలుగు)-11.00.4.40.10.30; ఛావా(హిందీ)-1.45, 7.40
- స్క్రీన్-2: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (తెలుగు)-1.30, 7.30; నారి(తెలుగు)-4.40; రా.. రాజా(తెలుగు)-10.30
- స్క్రీన్-3: జిగేల్(తెలుగు)-11.00; కింగ్స్టన్(తెలుగు)-1.30, 7.30; రిటర్న్ ఆఫ్ డ్రాగన్(తెలుగు)-4.40, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1: ఛావా(తెలుగు)-10.00; కింగ్స్టన్(తెలుగు)-1.20, 7.40; రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-4.20, 10.40
- స్క్రీన్-2: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (తెలుగు)-10.15; ఛావా(హిందీ)-1.30, 10.50; సివంగి(తెలుగు)-4.50; ఛావా(తెలుగు)-7.30
- స్క్రీన్-3: రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.25; ఛావా(తెలుగు)-1.35; మిక్కీ-17(ఇంగ్లీష్)-4.55, 7.50; కింగ్స్టన్(తెలుగు)-10.45
- స్క్రీన్ -4: నారి(తెలుగు)-10.35; మిక్కీ-17(ఇంగ్లీష్)-1.10. జాబిలమ్మ నీకు అంత కోపమా (తెలుగు)-1.30; సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (తెలుగు)-4.05, 10.30; రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-7.20

లలితామహల్	సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు
దేవి	మజాకా(తెలుగు)
నటరాజ్	రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్
విజయ్	ఛావా (తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	140
	(కిలోకు)	లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,300	వెండి(కిలో)	1,01,000
22 క్యారెట్స్	81,492		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

బోధన్‌రూరల్ : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ట్రాన్స్‌క్ డీఈ ఎండీ ముక్తార్, ఏడీఈ నగేష్ కుమార్‌లు సోమవారం తెలిపారు. మంగళవారం పట్టణ శివారులో ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయం (బెల్లాల్)లో ఈపరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్-2)ను నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు వినియోగదారుల నుంచి వినతులు స్వీకరిస్తారని వెల్లడించారు.

రేపు ఆర్మూర్‌లో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహనుమాన్ ఆవరణలో గల టౌన్ ఏఈ కార్యాలయంలో బుధవారం విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదు పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు ఏడీఈ కృష్ణ సోమవారం తెలిపారు. ఆర్మూర్‌టౌన్-1,2, దేగాం -5 పరిధిలోని వినియోగదారులు తమ విద్యుత్ సంబంధిత సమస్యలను విన్నవించుకోవచ్చని పేర్కొన్నారు.

యువ రైతులు మెలకువలను నేర్చుకోవాలి

నవీపేట : యువ రైతులు పంటల సాగులో మెలకువలను నేర్చుకోవాలని జిల్లా ఆత్మ పథక సంచాలకులు కెన్నత్ ప్రవీణ్ సూచించారు. మండలంలోని బినోల గ్రామంలో రైతు సాయినాథ్ వ్యవసాయక్షేత్రంలో డ్రోన్‌లతో రసాయనాల పిచికారి విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఇఫ్కో జిల్లా మేనేజర్ సాయి శివరామకృష్ణ, భరత్ కుమార్, ఏవో నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పారిశ్రామిక వేత్త దయానంద్‌రెడ్డి ఐదు కంప్యూటర్లను, ప్రింటర్లను సోమవారం అందజేశారు. దాతను ఎంఈవో రాజేశ్వర్ అభినందించారు హెచ్‌ఎం ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బెడ్ షీట్ల పంపిణీ

ముప్కాల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించిన బెడ్ షీట్లను సోమవారం ఎంఈవో జక్కుల రవి కుమార్ పంపిణీ చేశారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఉత్తూరి వర్ష సైన్స్ ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక కావడంతో విద్యార్థిని, గైడ్ టీచర్ శ్యామలను ఎంఈవో రవికుమార్, ఎస్‌వో వినోదలు ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.

ఇళ్ల స్థలాలు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

పోతంగల్ (రుద్రూర్): పోతంగల్ మండలం సుంకినిలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలు కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం తహసీల్దార్ గంగాధర్‌కు గ్రామస్తులు ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కేటాయించిన స్థలంలో సౌకర్యాలులేక పేదలు ఇళ్ల నిర్మించుకోలేదు. దీంతో కొందరు వ్యక్తులు ఆస్థలాన్ని కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రవన్న సంస్మరణ సభ

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని వెల్మల్ గ్రామంలో సీపీఐ ఎంఎల్, ప్రజాపంథా ఆధ్వర్యంలో రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) 9వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కె. గంగాధర్, రాజలింగం, అనంతరావు, జోవన్న, ఉమ్మెడ గంగారాం, లక్ష్మి, భూదేవి తదితరులు పాల్గొన్నారు.